www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

శనివారం

10 మే 2025

విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రిజకీయాలు, సామాజిక అంశిలపై అవగాహన ఉండి.. రియగల వరికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.


సెల్ : 9494 009 003



- 200 లకు పైగా డ్రోన్లకు కూల్చిన ఇండియన్ ఆర్మీ
- జమ్ముపైనే 100కు పైగా డ్రోన్ల ప్రయోగం
- సమర్ధవంతంగా తిప్పికొట్టిన భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్
- సైనిక స్థావరాలు, పౌర నివాసాలే టార్గెట్
- జమ్మకశ్మీర్, గుజరాత్, పంజాబ్, రాజస్థాన్ లలో హైఅలర్ట్
- యూరీ, కుప్వారా, సాంబా సెక్టార్, పూంచ్ నౌగామ్ జిల్లాలో కాల్పులు
- కాల్పులను సమర్ధవంతంగా తిప్పికొట్టిన ఆర్మీ
- ఫిరోజ్ పూర్ లో ఓ ఇంటిపై డ్రోన్ దాడి
- పలు ప్రాంతాల్లో మోగిన సైరన్లు
- జమ్ముకశ్మీర్, పంజాబ్, గుజరాత్, రాజస్థాన్ సరిహద్దులో హైఅలర్ట్
- సాంబాలో ఏడుగురు ఉగ్రవాదులు హతం
- త్రివిధ దళాధిపతులతో ప్రధాని వరుస భేటీలు

# దాయాది దుస్సాహసం

2లో



26 ప్రాంతాలపై వందల సంఖ్యలో డ్రోన్లతో దాడికి పాక్ యత్నం

## దీటుగా బదులిచ్చిన భారత్



## తెలంగాణకు హై అలర్ట్

4లో

- హైదరాబాద్ లో అలర్ట్ జోన్లో ఆరు ప్రాంతాలు
- ఫేక్ వార్తలను నమ్మొద్దని సూచన
- భద్రత కట్టుదిట్టంకేంద్ర హోమ్ శాఖ నుంచి ఆదేశాలు



## పుస్తె మట్టెలు అందజేత

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన పాడిరైతు ఏగుర్ల అయిలయ్యసుగుణ కూతురు వివాహనికి కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తే మట్టెలను సూపర్ వైజర్లు చిట్టి వెంకట్రామిరెడ్డి, గుర్రం సతీష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ డెయిరీ అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా కల్యాణమస్తు పథకం ద్వారా ఆడబిడ్డ పెళ్ళికి పుస్తే మట్టెలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు అవారు మల్లయ్య, సెక్రటరీ శ్రీహరి, పాల ఉత్పత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.



## బాధితురాలికి పరామర్శ

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ శాంతయ్య భార్య బాలమ్మ అనారోగ్యం తో చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి శుక్రవారం హాస్పిటల్ కి వెళ్లి బాలమ్మ ఆరోగ్యం గురించి డాక్టర్లని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. .



## యాదవ సంఘం భవనానికి భూమిపూజ

**కలంజ్యోతి, మల్యాల :** మండలం ఎక్స్ క్రాస్ రోడ్డు సమీపంలోని వరద కాల్వ వద్ద మండల యాదవసంఘం భవనానికి ఎంపీ లాడ్స్ నుంచి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ రూ.5లక్షలు నిధులు మంజూరు చేయడంతో శుక్రవారం యాదవ సంఘం సభ్యులు భూమిపూజ చేశారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎంపీ బండి సంజయ్ కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ శ్రీనివాస్, మల్లేశం, బొబ్బిలి వెంకటస్వామియాదవ్, సత్యనారాయణ, నాగరాజు, నరేష్, మండల యాదవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# దాయాది దుస్సాహసం

**కలంజ్యోతి ప్రతినిధి :**

భారత్ పై పాక్ డ్రోన్ యుద్ధం సాగిస్తున్నది. వందల సంఖ్యలో ఒకే సారి సరిహద్దుల్లోని 26 ప్రాంతాల పైకి టర్కీ మేడ్ డ్రోన్లతో దాడికి ప్రయత్నించింది. భారత్ కూడా అంతే ధీటుగా స్పందించింది. ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ద్వారా దాదాపు 200 డ్రోన్లకు పైగా కుప్పకూల్చింది. పాక్ తో సరిహద్దు పంచుకుంటున్న జమ్ము కశ్మీర్, పంజాబ్, గుజరాత్, రాజస్థాన్ లోని సైనిక స్థావరాలు, పౌర నివాసాలే టార్గెట్ గా వందల సంఖ్యలో డ్రోన్లను ప్రయోగించింది. జమ్ము 100కు పైగా, ఫిరోజ్ పూర్ లో 60, కచ్ 15, పఠాన్ కోట్ 10, జైసల్మేర్ 10, శ్రీనగర్ 10, అమృత్ సర్ 4, రాజస్థాన్ 10 సహా మొత్తంగా భారత్ 200లకు పైగా డ్రోన్లను కూల్చింది. పఠాన్ కోట్, శ్రీనగర్, భుజ్, జమ్ము, సాంబా, కుప్వారా, ఉరి, నౌగామ్, హంద్వారా సెక్టార్, పూంఛ్, పోఖ్రాన్, అమృత్ సర్ , రజౌరీ సహా 26 ప్రాంతాలపై ఏకాలంలో దాడులకు తెగబడింది. దాంతో జమ్ముకశ్మీర్, పంజాబ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కేంద్రం హై అలర్ట్ ప్రకటించింది. జమ్ముకశ్మీర్, రాజస్థాన్ రాష్ట్రాల్లో మెజార్టీ ప్రాంతాల్లో బ్లాక్ అవుట్ అమలు చేస్తుండగా.. సరిహద్దుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో పూర్తి స్థాయి బ్లాక్ అవుట్ అమలు చేసింది. పలు ప్రాంతాల్లో సైరన్లు మోత మోగించాయి. ఎక్కడికక్కడ ప్రజలను అప్రమత్తం చేశాయి బలగాలు. ఇంట్లో నుంచి బయటకు రావొద్దని హెచ్చరికలు జారీ చేశాయి. కానీ, పంజాబ్ లోని ఫిరోజ్ పూర్ లో మాత్రం దాయాది డ్రోన్ ఓ ఇంటిపై పడింది. అప్పటికే బ్లాక్ అవుట్ అమలు చేస్తున్నా.. జనరేటర్ సాయంతో లైట్లు వేసుకోవడంతో డ్రోన్ నేరుగా వచ్చి ఆ ఇంటిపై పడింది. మహిళా సహా పలువురికి గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన పోలీసులు వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు వెల్లడించారు. అంతకుముందు శుక్రవారం మధ్యాహ్నం సాంబా సెక్టార్ లో లష్కరే తోయిబాకు చెందిన 11 మంది ఉగ్రవాదులు భారత్ లోకి చొరబడే ప్రయత్నం చేశారు. గమనించిన బీఎస్ఎఫ్ జవాన్లు కాల్పులు వారిపై తూటాలు కురిపించడంతో ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. పాక్ కు చెందిన ధన్ ధర్ పోస్టుపై కాల్పులు జరపడంతో ఆ పోస్టు నుంచీ పాక్ జవాన్లు పారిపోయారు.

### వ్యూహాత్మకంగా డ్రోన్ల ప్రయోగం

పాకిస్థాన్ శుక్రవారం రాత్రి వ్యూహాత్మకంగా డ్రోన్లను ప్రయోగించింది. దాంట్లో ముఖ్యంగా మనకు డ్రోన్లు ప్రయోగించినట్టుగా అర్థమయ్యేలా తేలికైనా.. లైట్లు వేసుకుని భారత గగనతలంలోకి ప్రవేశించాయి. వాటిని గమనించిన భారత్ వాటిని కూల్చే పనిలో నిమగ్నమయ్యారు. ఆ వెంటనే పాక్ లైట్లు లేని అత్యాధునిక శక్తిమంతమైన డ్రోన్లను ప్రయోగించింది. భారత సైన్యం తేలికపాటి డ్రోన్లను కూల్చే పనిమీద ఉంటే అత్యాధునిక డ్రోన్లతో



విధ్వంసం చేయొచ్చనే కుట్రకు పాల్పడింది. కానీ, బలగాలు పాక్ కుటిల బుద్ధి ముందుగానే గుర్తించి రెండు రకాల డ్రోన్లను కూల్చే పనిలో పడింది. దాంతో వారు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

### కాల్పులే.. కాల్పులు..

శుక్రవారం ఉదయం నుంచి జమ్ము సహా పలు సరిహద్దు గ్రామాలపై కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ.. కాల్పులకు తెగబడింది. యూరీ, కుప్వారా, పూంఛ్, నౌగామ్ సెక్టార్లలో కాల్పుల మోత మోగుతున్నది. మోటార్ షెల్స్, కాల్పులతో పౌరులు, స్థిర నివాసాలే టార్గెట్ గా దాడులకు దిగారు. దీంట్లో ఒక్క మహిళా సహా ఆంధ్రప్రదేశ్ కు చెందిన జవాన్ మురళీనాయక్ మరణించారు. సత్యసాయి జిల్లా కల్లితండాకు చెందిన మురళీ నాయక్ పాక్ సైనికులతో వీరోచితంగా పోరాడి వీర మరణం పొందారు. కాల్పులను ఆర్మీ సమర్థవంతంగా తిప్పికొట్టడంతో పాటు పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పాక్ ఆర్మీ పౌరులు, ఇండ్లను టార్గెట్ చేసుకోవడంతో నివాసాలు, వాహనాలు భారీ ఎత్తున ధ్వంసం అవుతున్నాయి. ప్రజలు వెంటనే బంకర్లలో తల దాచుకోవాలని ఆర్మీ వారికి సూచించింది.

### ఫిరోజ్ పూర్ లో డ్రోన్ దాడి

జమ్ము కశ్మీర్ లోని ఫిరోజ్ పూర్ లో పాక్ డ్రోన్ ఓ ఇంటిపై దాడి చేసింది. జమ్ములో అప్పటికే బ్లాక్ అవుట్ అమలులో ఉన్నా.. జనరేటర్ సాయంతో లైట్లు వేసి ఉండడంతో డ్రోన్ నేరుగా వారి ఇంటిపై పడింది. దాంతో ఆ ఇంట్లోని మహిళకు తీవ్ర గాయాలు కాగా.. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఇది గమనించిన చుట్టుపక్కల ఇంటి వాళ్లు శెంటనే మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా.. అదుపులోకి వచ్చేందుకు చాలా సమయం పట్టింది. సమాచారం అందుకున్న జమ్ము పోలీసులు వెంటనే క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు వెల్లడించారు. పఠాన్ కోట్ లోనూ ఓ డ్రోన్ పంట పొలాల్లో కూలింది. భారీ శబ్దంతో కూలడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ముఖ్యంగా పంట పొలాల్లో మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో వారు బయటకు వచ్చేందుకు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

### మోగిన సైరన్లు.. బ్లాక్ అవుట్

దాయాది డ్రోన్ దాడులతో పలు ప్రాంతాల్లో సైరన్లు మోగాయి. జమ్మూ, అక్నూర్, జైసల్మేర్, అంబాలా, పంచుకుల, ఫిరోజ్ పూర్, జమ్ము డివిజన్ లోని ఉధంపూర్, జలంధర్, మోగా, ఫజిల్కాల్ లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పలు ప్రాంతాల్లో బ్లాక్ అవుట్ పాటిస్తున్నారు. తాను ఉన్న చోట నుండి అడపాదడపా పేలుళ్ల శబ్దాలు వినబడుతున్నాయని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ పోస్టుతో పాటు చీకట్లో ఉన్న నగరానికి సంబంధించిన చిత్రాన్ని కూడా ఆయన పోస్ట్ చేశారు. ఇప్పుడు జమ్మూలో బ్లాక్అవుట్. నగరం అంతటా సైరన్‌లు వినబడుతున్నాయి అని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. రాజస్థాన్ లో హైఅలర్ట్.. జై సల్మేర్, రాంఘఢ్, బడ్ మేర్, ఫలోది, పోక్రాన్, బికనీర్, గంగానగర్ లో బ్లాక్ అవుట్ నిర్వహిస్తున్నారు.

### జమ్మకశ్మీర్, గుజరాత్, పంజాబ్, రాజస్థాన్ లలో హైఅలర్ట్


జమ్ము కశ్మీర్, గుజరాత్, పంజాబ్, రాజస్థాన్ లలో కేంద్రం హై అలర్ట్ ప్రకటించింది. రాజస్థాన్ లో.. జై సల్మేర్, రాంఘఢ్, బడ్ మేర్, ఫలోది, పోక్రాన్, బికనీర్, గంగానగర్ లో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సాయంత్రం 5 గంటల నుంచి జనం ఇళ్లలోనే ఉండాలని భారత ఆర్మీ ఆదేశాలు జారీ చేసింది. జమ్మూ కాశ్మీర్ లోని పూంచ్ సెక్టార్ లో బరితెగించిన పాక్.. సామాన్యుల ఇళ్లపై దాడులు.. ఓ ఇంటిపై చేసిన దాడి సీసీ టీవీలో రికార్డ్ అయ్యాయి. సోషల్ మీడియాలో అవి ప్రస్తుతం వైరల్ గా మారాయి. గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. సరిహద్దులో ఉన్న జిల్లాల్లో తీసుకున్న భద్రతాచర్యలపై ఆరా తీశారు. సమస్యాత్మక జిల్లాల్లో చేపట్టిన చర్యలపై ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారు.

### ప్రధాని వరుస భేటీలు..

దాయాదితో నెలకొన్న ఉద్రిక్తత వేళ ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం రోజంతా వరుస సమావేశాలతో బిజీబిజీగా గడిపారు. పాక్ డ్రోన్ల దాడులతో రెచ్చిపోతున్న క్రమంలో విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్‌తో తన నివాసంలో ప్రధాని భేటీ అయ్యారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీలు కూడా సమావేశంలో పాల్గొన్నారు. అంతకుముందు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోబల్, త్రివిధ దళాధిపతులతో ప్రధాని మోదీ భేటీ నిర్వహించారు. ఈ భేటీకి ముందు బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, హోంశాఖలోని సీనియర్ అధికారులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమావేశమయ్యారు. సరిహద్దుల్లో, విమానాశ్రయాల్లో భద్రతా ఏర్పాట్లను ఆయన సమీక్షించారు.

# ఎమ్మెల్యే వస్తేనే తాళి కడతా!

## మొండికేసిన పెళ్లి కొడుకు



**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** ఎమ్మెల్యే వస్తేనే తాళి కడతానని పెళ్లి కొడుకు మొండికేసి కూర్చున్న ఘటన నాగర్ కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కాంగ్రెస్ కార్యకర్త సాయికుమార్ కు పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన అనూషతో పెళ్లి నిశ్చయమైంది. తెలకపల్లిలో శుక్రవారం ఉదయం 9.05 నిమిషాలకు ముహూర్తం ఫిక్స్ చేసుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ముహూర్తం టైం దగ్గరికి వచ్చింది. తాళి కట్టకుండా తన పెళ్లికి నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి వస్తేనే తాళి కడతానని మొండికేసి కూర్చున్నాడు. దాంతో ఒక్కసారిగా అక్కడున్న బంధువులు షాక్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విషయం ఎమ్మెల్యేకి తెలపడంతో హుటాహుటిన పెళ్ళికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. తన అభిమాని, పార్టీ కార్యకర్త కోరిక మేరకు ఎమ్మెల్యే పెళ్లికి రావడం పట్ల గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యేగా రాజేష్ రెడ్డి గెలిచినప్పుడు కూడా సాయికుమార్ మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేసి మొక్కు తీర్చినట్లు గ్రామస్తులు తెలిపారు.



# జగిత్యాల వాసికి డాక్టరేట్

**కలంజ్యోతి, జగిత్యాల :** జిల్లా కేంద్రానికి చెందిన మెట్టు సంయుక్త ఉస్మానియా యూనివర్సిటీలో ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ నుంచి డాక్టరేట్ పొందారు. ఉస్మానియా ప్రొఫెసర్ డా.అశోక్ పర్యవేక్షణలో రేమినిసెన్స్ అండ్ రెసిస్టెన్స్ ఇన్ దళిత్ ఉమెన్ లైఫ్ నరేటివ్స్ అనే అంశం పై పరిశోధన పూర్తి చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ పట్టా అందజేసింది. డాక్టరేట్ సాధించినందుకు కుటుంబ సభ్యులు తోటి పరిశోధకులు సంతోషం వ్యక్తం చేశారు. తన భర్త సహకారంతోనే డాక్టరేట్ సాధించానని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

# పంట మార్పిడితో లాభాలు

## రైతు ముంగిట కార్యక్రమంలో శాస్త్రవేత్తలు



**కలంజ్యోతి, మల్యాల :** పంట మార్పిడితో లాభాలు చేరుకుతాయని రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమంలో అగ్రోనోమి శాస్త్రవేత్త డాక్టర్ ఈ రజినీకాంత్ సూచించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ పాలిటెక్నిక్, జగిత్యాల శాస్త్రవేత్తలు, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ తో అనుసంధానమై రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం మానాలా గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రజినీకాంత్ మాట్లాడుతూ రైతులకు సాగునీటి యాజమాన్యం, పంట మార్పిడి, చెట్లను పెంచడం పర్యవరణాన్ని కాపాడడం మొదలగు అంశాల మీద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్ సాయినాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వాతి, ఎ.మంజుల, జి. శ్యామ్ ప్రసాద్, ఆదర్శ రైతు ఎస్.దశరథ్, ఏఈవోలు ఎన్ కారుణ్యకుమార్, ఇ.శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ ఇ.రాజన్న, లోహియా కంపెనీ ప్రతినిధి ఎన్.అనిల్ కుమార్, రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థి నర్మద పాల్గొన్నారు.





# భూమికి హద్దులు నిర్ణయించండి

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** ప్రభుత్వం తమకు కేటాయించిన భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామానికి చెందిన అంబేద్కర్ సంఘ సభ్యులు శుక్రవారం ఇల్లంతకుంట తహసీల్దార్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1978లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దళితులకు నివాస స్థలాలు పట్టాలు ఇచ్చారని, అందులో భాగంగా కొన్నిప్లాట్లకు సంబంధించి భూసేకరణ చేసి పంపిణీ చేయకుండా అలాగే వదిలేశారన్నారు. గత రెండు సంవత్సరాల క్రితం దళితులు అప్పటి ఎమ్మార్వో సర్వే చేసి హద్దులు నిర్ణయించడం జరిగిందన్నారు. కానీ అదే సర్వే నెంబర్ లో ఉన్న ఒక రైతు ఈ భూమి తనదే అని ప్రభుత్వం తప్పుగా సర్వే చేసిందని కోర్టు ద్వారా అంబేద్కర్ సంఘ సభ్యులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. కాబట్టి స్థానిక రెవెన్యూ అధికారులు మరొకసారి భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించి 1978లో ఎంతమందికి పట్టా జారీ చేశారో దానికి సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పసుల నరేష్ కుమార్, సీనియర్ నాయకులు పసుల వెంకన్న, గన్నేరం నర్సయ్య, అంబేద్కర్ సంఘ సభ్యులు అనిల్, సంజిత్, అనిల్, శ్రీనివాస్, లచ్చయ్య, మల్లేశం పాల్గొన్నారు.



## పంచాయతీరాజ్ వ్యవస్థలను నిర్లక్ష్యం చేసిన

# పార్టీలకు బుద్ధి చెప్పాలి

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పంచాయతీరాజ్ వ్యవస్థలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని గ్రామాల్లో పాలకవర్గాలు లేకపోవడం వలన అభివృద్ధి కుంటు పడిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. 2025-26 సంవత్సరమునకు గానూ సభ్యత్వం పొందిన పార్టీ శ్రేణులకు పార్టీ డిజిటల్ సభ్యత్వ కార్డులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలలో అధిక స్థానాలు గెలుచుకునే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ పైన కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని స్థానిక నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కన్వీనర్ గజ బీమ్ కార్ ఎల్లోజి, సీనియర్ నాయకులు చర్ల ప్రతాప్, అనుపురం చిరంజీవి, శ్రీనివాస్, కుమ్మరి నర్సయ్య, ఇమ్మడోజు మల్లికార్జున్, మహిళా నాయకురాళ్లు వసంత, రాజవ్వ, కులాల లక్ష్మి, తారవ్వ, అనసూయ, తిరుపతమ్మ పాల్గొన్నారు.



## ఎల్వోసీ అందజేత

**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని రాజారాం గ్రామానికి చెందిన శివరాత్రి గంగరాజం అనారోగ్యంతో నిమ్స్ లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ బత్తిని మల్లీశ్వరి శ్రీనివాస్ గౌడ్, శనిగారపు తిరుపతి , నక్క అనిల్, బండి రవి, నర్సయ్య, వెంకట్ ఉన్నారు.



## చలివేంద్రం ప్రారంభం



**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండలం ముల్కనూర్ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హనంకొండ టీఎస్ ఆర్టీసీ (డీఎం) డిపో మేనేజర్ భూక్య ధరమ్ సింగ్ మాట్లాడుతూ.. తాము ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రయాణికులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్వైజర్ గౌస్ మొహీనుద్దీన్, ముల్కనూర్ బస్ స్టేషన్ మేనేజర్ సీఆర్ మల్లు, బానోతు రాజలింగం నాయక్, డ్రైవర్ ఏఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## టికెట్ డబ్బులు వాపస్

**కలంజ్యోతి, హైదరాబాద్ :** ఫ్యాన్స్‌కు సన్‌రైజర్స్ హైదరాబాద్ గుడ్‌న్యూస్ చెప్పింది. మే 10 ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్ రద్దు అయింది. దాంతో ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. మ్యాచ్ చూడటానికి టికెట్ కొనుగోలు చేసిన వారికి టికెట్ డబ్బులను రీఫండ్ చేయనున్నట్లు ఎస్ఆర్‌హెచ్ తెలిపింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్ వెల్లడించింది. 'ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ఐపీఎల్ 2025 తక్షణమే నిలిపివేశారు. టికెట్ వాపసు వివరాలు త్వరలో తెలియజేస్తాము' అని ఎస్ఆర్‌హెచ్ పేర్కొంది.



# తెలంగాణకు హై అలర్ట్

▸ హైదరాబాద్ లో అలర్ట్ జోన్లో ఆరు ప్రాంతాలు



**కలంజ్యోతి, హైదరాబాద్ :** భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ తెలంగాణలో ఆరు ప్రాంతాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. తెలంగాణలోని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, కూకట్‌పల్లి, నాంపల్లి, హైదరాబాద్ సెంట్రల్ బస్‌స్టేషన్, ట్యాంక్‌బండ్ లో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని కేంద్రం సూచించింది. హైదరాబాద్ అంతా కూడా అలర్ట్ జోన్‌లో ఉన్నది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షణ కొనసాగుతోంది. డీజీ స్థాయి అధికారి హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ పర్యవేక్షణలోనే సూచనలు వెళ్తున్నాయి. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌లను నమ్మవద్దని పోలీసులు, ప్రభుత్వం ఇచ్చే అధికారిక సమాచారాన్నే నమ్మాలని పోలీసులు చెబుతున్నారు.

**జోన్ లో ఆరు ప్రాంతాలు**

హైదరాబాద్‌లోని ఆరు హైఅలర్ట్ జోన్లలో ఉన్నాయి. అక్టోపస్, లా అండ్ అండ్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు వీటిపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాయి. పాక్ దాడుల నేపథ్యంలో అధికారులను కేంద్ర హోంశాఖ అధికారులు అప్రమత్తం చేశారు. మరోవైపు భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రాలను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అప్రమత్తం చేస్తోంది. అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ సెక్రటరీలకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ లేఖ రాసింది. అవసరమైన ముందు జాగ్రత్త చర్యలను సమర్థవంతంగా అమలు చేయడానికి పౌర రక్షణ నిబంధనల ప్రకారం అత్యవసర అధికారాలను ఉపయోగించాలని ఆదేశించింది. దేశ వ్యాప్తంగా అన్ని పోర్టుల్లో భద్రత పెంచారు. భద్రతను రెండో లెవల్‌కు పెంచుతూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. భద్రతా పెంపు ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తాయని షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ తెలిపారు. పోర్టులు, షిప్పులు, టర్మినల్స్‌లో కేంద్రం భద్రతను పెంచింది.

**స్టేషన్లలో భద్రత పెంచాం**
**– సెంట్రల్ రైల్వే సీపీఆర్వో శ్రీధర్**

భారత్, పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో రైల్వే స్టేషన్లలో భద్రత పెంచామని సెంట్రల్ రైల్వే సీపీఆర్వో శ్రీధర్ అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో ఉద్యోగుల సెలవులను రద్దు చేశామన్నారు. ఆర్పీఎఫ్, ఇంటెలిజెన్సీ పోలీసుల నిఘా పెంచామని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలను రద్దు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే నుంచి గుజరాత్, ఢిల్లీ, రాజస్థాన్ రూట్లల్లో రైళ్లు యథావిధిగా నడుస్తున్నాయన్నారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్‌పై ప్రత్యేకంగా నిఘా పెట్టామని శ్రీధర్ వెల్లడించారు.

**శంషాబాద్ బాంబు బెదిరింపులు**

-పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న సమయంలో శంషాబాద్ విమానాశ్రయాన్ని పేల్చేస్తాం అంటూ మెయిల్ రావడంతో ఒక్కసారిగా పోలీసులు ఉలిక్కిపడ్డారు. శుక్రవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పేల్చేస్తామంటూ గుర్తు తెలియని ఆగంతకులు శంషాబాద్ విమానాశ్రయ కార్యాలయానికి మెయిల్ పంపారు. దాంతో ఎయిర్పోర్ట్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ పోలీసులు విమానాశ్రయంలోని డిపార్చర్, అరైవల్, పార్కింగ్, రన్వే, ప్రయాణికుల లగేజ్ తో పాటు తదితర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్, బాంబుస్కార్డ్ తో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఎక్కడ ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానితులు కనిపించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వచ్చిన మెయిల్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలంజ్యోతి 5
శనివారం 10.05.2025 General News



# ఐదేండ్లు శిక్ష అనుభవించాల్సిందే

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- ప్రజలు కాంగ్రెస్ ను నమ్మి మోసపోయారు
- హామీల అమలు కోసం కాంగ్రెస్ ను వెంటాడుతాం
- దొంగను దొంగలా చూడకుండా మరెలా చూస్తారు..?

**కలంజ్యోతి, ఖమ్మం:** మోసపూరిత కాంగ్రెస్ మాటలు విన్న రాష్ట్ర ప్రజలు మోసపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తాము మోసపోయిన విషయాన్ని వారు ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నారని తెలిపారు. హస్తానికి ఓటేసిన తప్పు.. పాపానికి వచ్చే ఐదేండ్లు దీని ఫలితం అనుభవించాల్సిందేనని వ్యాఖ్యానించారు. శుక్రవారం ఖమ్మం



జిల్లా తల్లాడ మండల పరిధిలోని మిట్టపల్లిలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకట శేషగిరి కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కేటీఆర్ హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేలా వెంటపడుతామని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం దివాళా తీసిందని ఆరోపించారు. ఢిల్లీ వెళ్తే తనను దొంగల్లా చూస్తున్నారన్న రేవంత్ ను.. దొంగను దొంగలా చూడకపోతే ఎలా చూస్తారని విమర్శించారు. గుడిలో చెప్పులు ఎత్తుకుపోయే వారిలా చూస్తున్నారనడం రేవంత్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా చేసింది శూన్యమని, జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. లింగాల కమల్ రాజ్ ను ఓడించేందుకు భట్టి విక్రమార్క ప్రజలకు తప్పుడు హామీలిచ్చారని, బాండ్ పేపర్లు రాసి దేవుని గుడిలో పెట్టి ఎన్నికల్లో గెలిచిన భట్టి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగే షాక్ ఇవ్వాలని, అందుకు బీఆర్ఎస్ శ్రేణులు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ఎప్పటికీ తెలంగాణ ప్రజలకు గులాబీ పార్టీనే అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్,మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వర్ రావు, మెచ్చా నాగేశ్వర్ రావు తదితరులున్నారు.

# భారత్ విజయం కోసం ప్రత్యేక పూజలు

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు, పాకిస్తాన్‌పై జరుగుతున్న యుద్ధంలో భారత సైని కులు విజయం సాధించాలనే అభిలాషతో శుక్ర వారం కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవస్థానంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి పి.కిషన్ రావు టెలి ఫోన్ ఆదేశాల ప్రకారం అర్చకులు, సిబ్బంది సమాహారంగా పూజలు నిర్వహించారు. దేశ సైనికుల ఆరోగ్యం, దేశ విజయాన్ని కోరుతూ 'భారతమాత కి జై' నినాదాలతో సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో కాంచనపల్లి రాజ న్నశర్మ, మొగిలిపాలెం రాంబాబు, దేవాలయ అర్చకులు తాటికొండ వినయ్ శర్మ, మొగిలిపాలెం శివకుమార్, కాంచనపల్లి శరత్ చంద్ర, నందనం శ్రవణ్, జగన్ పాల్గొన్నారు.





# టెరిటోరియల్ ఆర్మీని పిలవండి

## ఆర్మీ చీఫ్ స్వేచ్ఛ ఇచ్చిన కేంద్రం

**కలంజ్యోతి ప్రతినిధి :** టెరిటోరియల్ ఆర్మీని కేంద్రం రంగంలోకి దింపబోతున్నది. పీవోకేలో ధోనీ 'సిక్సర్'కొడతాడనే వాదనలు వినిపిస్తున్నాయి. భారత్ -పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో టెరిటోరియల్ ఆర్మీని పిలవాలని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదికి కేంద్ర రక్షణశాఖ అధికారాన్ని ఇచ్చింది. శుక్రవారం రాజ్ నాథ్ సింగ్ తో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.1948 టెరిటోరియల్ ఆర్మీ రూల్ 33 అధికారాలను ఉపయోగించుకోవాలని సూచించారు. భారత దళాలకు సహాయం చేసేందుకు రెండో రక్షణ శ్రేణిగా టెరిటోరియల్ ఆర్మీని నియమించుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 32 పదాతిదళ బెటాలియన్లలో (టెరిటోరియల్ ఆర్మీ), సదరన్ కమాండ్, ఈస్టర్న్ కమాండ్, వెస్ట్రన్ కమాండ్, సెంట్రల్ కమాండ్, నార్తర్న్ కమాండ్, సౌత్ వెస్ట్రన్ కమాండ్, అండమాన్, నికోబార్ కమాండ్, ఆర్మీ ట్రైనింగ్ కమాండ్ ప్రాంతాలలో మోహరించడానికి 14 పదాతిదళ బెటాలియన్లు (టెరిటోరియల్ ఆర్మీ) లకు చోటు లభించనున్నది.

**టెరిటోరియల్ ఆర్మీ అంటే ఏమిటి?**

ఎమర్జెన్సీ సమయాల్లో యుద్ధంలో సైనికులు అలసిపోతుంటారు. వీరి అలసటను తగ్గించేందుకు తాత్కాలికంగా ఈ ఆర్మీని నియమించుకుంటారు. ఇందుకోసం 18 సంవత్సరాల నుంచి 42 ఏళ్లు ఉన్నవారు అర్హులు. అయితే ఈ ఆర్మీలో ఇంతకుముందే పేర్లు నమోదు చేసుకున్న వారికి కూడా అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. గతంలో టెరిటోరియల్ ఆర్మీలో నియమితులై శిక్షణ పొందిన వారిని కూడా తిరిగి పిలవనున్నది. టెరిటోరియల్ ఆర్మీలో పలువురు ప్రముఖులు కూడా తమ పేర్లను నమోదు చేసుకోవడమే గాకుండా పలుమార్లు సరిహద్దుల్లో విధులు కూడా నిర్వహించారు. ఇందులో ప్రముఖంగా ఝార్ఖండ్ డైనమేట్ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ (ఆర్మీ), సచిన్ టెండూల్కర్ (నేవీ), సినీనటుడు అక్షయ్ కుమార్ లాంటి వారు కూడా ఉన్నారు. ఇప్పుడు వీరంతా సైన్యానికి మనోస్థైర్యంగా రంగంలోకి దిగుతారా? అన్నది తెలియాల్సి ఉంది. కాగా ఝార్ఖండ్ డైనమేట్ ధోనీ రంగంలోకి దిగితే మాత్రం పీవోకే 'సిక్సర్' బాంబు విసిరే అవకాశం లేకపోలేదని పాక్ అప్రమత్తమైందని సోషల్ మాధ్యమంగా పలు ఆసక్తికర పోస్టులు దర్శనం ఇస్తున్నాయి.

# సింధు జలాల్లో మేమేం చేయలేం

## ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ అజయ్

**న్యూ ఢిల్లీ :** సింధు జలాల ఒప్పందం సస్పెన్షన్ విషయంలో సహాయకుడిని మించి పాత్రను తాము పోషించలేమని ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా స్పష్టం చేశారు. ఒప్పందం రద్దు అంశంపై మీడియాలో వస్తున్న విభిన్న వాదనలపై బంగా శుక్రవారం ప్రకటన చేశారు. ఈ అంశంపై ప్రపంచబ్యాంకు ఎలాంటి జోక్యం చేసుకోబోదన్నారు. మీడియాలో వస్తున్నవన్నీ ఊహాగానాలే అన్నారు. స్పష్టత లేదన్నారు. ప్రపంచబ్యాంకు కేవలం ఆర్థిక స్థితిగతులను మాత్రమే సులభతరం చేసేందుకు ప్రయత్నిస్తుందని స్పష్టం చేశారు. పహల్గామ్ దాడి అనంతరం భారత్ పలు ఒప్పందాల రద్దుపై ప్రపంచబ్యాంకుపై కూడా పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు అజయ్ బంగా అనుమానాలను నివృత్తి చేశారు.

Cinema
కలంజ్యోతి
శనివారం 10.05.2025



# నేను హీరోయిన్ అని తెలియదు

ప్రముఖ మలయాళం నటి అమలా పాల్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. తన భర్త జగత్ దేసాయిని డేటింగ్ చేస్తున్న సమయంలో తాను ఒక నటినని అతనికి తెలియదని ఆమె చెప్పారు. ఇటీవల ఒక అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న అమలా పాల్ ఈ విషయాన్ని మీడియాతో పంచుకున్నారు. ఆమె మాట్లాడుతూ, "మేము గోవాలో కలిశాం. జగత్ గుజరాతీ అయినప్పటికీ అక్కడే ఉంటున్నాడు. నేను కేవలం కేరళకు చెందిన అమ్మాయినని మాత్రమే అతనికి చెప్పాను. అతను ఎక్కువగా దక్షిణాది సినిమాలు చూడడు. నేను నటినని కూడా అతనికి చెప్పలేదు. కేవలం నా వ్యక్తిగత ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను మాత్రమే అతనికి చూపించాను" అని అన్నారు. అయితే నేను గర్భవతిగా ఉన్న సమయంలో తానకు నేను హీరోయిన్ అని తెలిసింది. దాంతో నేను గర్భంతో ఇంట్లో ఉన్నప్పుడు, అతను ఒక్కొక్కటిగా నా సినిమాలు చూడటం ప్రారంభించాడు. అతనికి అవార్డుల కార్యక్రమాలు చూడటమంటే చాలా ఇష్టం. నేను అవార్డులు తీసుకోవడం, రెడ్ కార్పెట్‌పై నడవడం, స్టేజ్‌పై మాట్లాడటం చూసి అతను చాలా ఆశ్చర్యపోయాడు అంటూ అమలాపాల్ తెలిపింది.